క్లుప్తంగా

ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు ప్రారంభం

హాలహర్వి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియెట్ కళాశాల ప్రారంభమైందని, కొత్తగా అడ్మిషన్లు చేపడుతున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ హుసేన్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంపీసీలో–40 సీట్లు, సీఈసీలో–40 సీట్లు, బైపీసీలో–40 సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. అడ్మిషన్స్ పొందాలనుకునే విద్యార్థులు స్థానిక కళాశాలలో సంప్రదించాలన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



ఆస్పరిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మహానంది తదితరులు

ఆస్పరి: ఆలూరు ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుసినె విరుపాక్షి విజయం తథ్యమని పార్టీ నాయకులు మహానంది, మసాల ప్రకాష్, తిమ్మప్ప, తెవుల ప్రకాష్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. వారు బుధవారం ఆస్పరిలో విలేకరులతో మాట్లాడుతూ ..మండలంలో ఎన్నడూ జరగనంతగా 81 శాతం పోలింగ్ నమోదైందన్నారు. అభ్యర్థి విజయం కోసం నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, సభ్యులు కష్టపడ్డారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకున్న వారు వేరే ప్రాంతాల్లో ఉన్నా స్వచ్ఛందంగా వచ్చి ఓట్లు వేశారన్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ హేమసుందర్

హాలహర్వి: మండలంలోని విరుపాపురం, బల్లోట, నిట్రవట్టి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఏపీఓ హేమసుందర్ పరిశీలించారు. కూలీల మస్టర్‌లను తనిఖీ చేసి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం కావడంతో ఉదయాన్నే ఉపాధి కూలీలు పనుల్లో పాల్గొనాలన్నారు. రోజుకు రూ.300 గిట్టుబాటు వేతనం అందుతుందన్నారు. సరైన కొలతల ప్రకారం పనిచేస్తే మంచి కూలీ లభిస్తుందన్నారు. ఈయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి




శంకరబండ గ్రామ సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఆస్పరి: ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ కల్యాణ్‌చక్రవర్తి కూలీలకు సూచించారు. ఆయన బుధవారం ఆస్పరిలో విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో ప్రతి రోజు 7200 మంది పనులకు హాజరుకావాల్సి ఉండగా బుధవారం 5516 మంది కూలీలు పనులకు హాజరయ్యారన్నారు. నిర్దిష్ట కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300 వేతనం అందుతుందదన్నారు. ఎప్పటికప్పుడు వేతనాలు కూలీల బ్యాంకు ఖాతాలో జమవుతున్నాయని చెప్పారు. వ్యవసాయ కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

930 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరు

మద్దికెర: ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం సబ్సిడీతో అందజేసే వేరుశనగ విత్తనాలు మండలానికి 930 క్వింటాళ్లు మంజూరు అయినట్లు ఏఓ రవి బుధవారం తెలిపారు. కే–6 రకం 860 క్వింటాళ్లు, టీసీజీఎస్–1694 రకం 70 క్వింటాళ్లు మంజూరు అయ్యాయన్నారు. విత్తనాలు వచ్చిన వెంటనే రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తామన్నారు.

పొలం పనుల్లో రైతులు బిజీ



రామాపురం వద్ద దుక్కి దున్నుతున్న రైతు

తుగ్గలి: మండలంలో రెండురోజుల క్రితం కురిసిన వర్షానికి పొలాలు తడిసి పదునెక్కాయి. దీంతో రైతన్నలు ఖరీఫ్ సీజన్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈనెల 7న 22.4మి.మీ వర్షపాతం , 12న 14.4మి.మీ వర్షం కురిసింది. ముందస్తు వర్షాలు కురవడంతో రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. పంట దిగుబడులు పెరగడానికి వేసవి దుక్కులు ఎంతగానో ఉపయోగపడతాయని రైతులు పేర్కొంటున్నారు.

అన్నదాతకు అండగా అగ్రిల్యాబ్‌లు

- నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు చెక్
- ఉచితంగా నిర్ధారణ పరీక్షలు
- నకిలీలని తేలితే సంబంధిత విత్తన కంపెనీలపై కేసు నమోదు
- ఫలితాలు తారుమారు కాకుండా ల్యాబ్‌లో ఆటోమిషన్ ఏర్పాటు
- రైతులు సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



విత్తన పరీక్షలను పరిశీలిస్తున్న ఆలూరు ఏడీఏ సునీత

ఆలూరు రూరల్: విత్తనం మంచిదైతే పంట బాగా పండుతుంది. దిగుబడికి దిగులుండదు. దిగుబడి, ధరలు అనుకూలిస్తే రైతులకు తిరుగుండదు. అంతా సవ్యంగా జరగాలంటే సాగుకు మేలైన రకం విత్తనాలు కావాలి. రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారి ఉన్నతి కోసం నియోజకవర్గానికొక సమగ్ర వ్యవసాయ పరీక్షా కేంద్రం (వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్) మంజూరు చేశారు. ఇందులో భాగంగానే ఆలూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా 2021 సెప్టెంబర్ 8న అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ప్రారంభించారు. అప్పటినుంచి ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఆరుగాలం శ్రమించే అన్నదాతలు నకిలీ విత్తనాలతో మోసపోకూడదనే సంకల్పంతో పైసా ఖర్చు లేకుండా ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నాణ్యతను పరీక్షించేలా ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు విత్తన పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

టెస్టింగ్ ప్రక్రియ ఇలా..

ఎరువులు, పురుగు మందులు, విత్తనాల నాణ్యత పరీక్షలను పాదర్శకంగా చేపట్టేందుకు విశాఖపట్నం, తిరుపతి, అమరావతి, తాడేపల్లిగూడెంలో ప్రభుత్వం నాలుగు ప్రాంతీయ కోడింగ్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ లక్ష్యాల మేరకు వ్యవసాయ అధికారులు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో శాంపిల్స్‌ను సేకరించి ప్రత్యేక యాప్ ద్వారా బ్యాచ్ నంబర్ కోడింగ్ చేసి రీజనల్ సెంటర్లకు పంపిస్తారు. ఆ శాంపిల్స్‌ను రీజనల్ సెంటర్ల నుంచి ఆయా నియోజకవర్గాల్లోని అగ్రి ల్యాబ్‌లకు పంపి పరీక్షలు చేయిస్తారు. విత్తనాల మొలక శాతం, తేమ శాతం, నాణ్యత ప్రమాణాలు పరిణామాలపై పరీక్షలు నిర్వహించి నివేదికలు ఇస్తారు. నకిలీలని తేలితే సంబంధిత షాపులు, విత్తన కంపెనీలపై చర్యలకు సిఫార్సు చేస్తారు. కేసు నమోదు చేయించి కోర్టులో నిలబెడతారు. ఎరువులు, విత్తనాలు, మందులు నకిలీలని తేలితే రీ–అనాలసిస్ (తిరిగి పరీక్ష) చేసేందుకు షాపులో ఉన్న సరకు సీజ్ చేస్తారు. కేసు పెట్టి జాయింట్ కలెక్టర్ కోర్టుకు హాజరుపరుస్తారు.

రైతులకు పరీక్షలు ఉచితం

రైతులు విత్తుకు ముందు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై అనుమానం ఉంటే అగ్రిల్యాబ్‌కు వెళ్లి ఉచితంగా పరీక్ష చేయించుకునే వెసలుబాటు కల్పించారు. ఇందుకు వ్యవసాయ అధికారులు సహకరిస్తారు. విత్తన, ఎరువులు, పురుగు మందుల కంపెనీల ప్రైవేటు డీలర్లు పరీక్ష చేయించుకోవాలంటే మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించాల్సి ఉంటుంది.



ఆలూరులోని వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్

సీడ్, కెమికల్ ఫర్టిలైజర్, బయో,ఆర్గానిక్ ఫర్టిలైజర్ పరీక్షల కోసం రూ.1000 నుంచి రూ.3,500 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం రైతులకు సమీపంలోనే ల్యాబ్‌లు అందుబాటులోకి రావడం, అధునాతన సాంకేతికతతో పరీక్షలు నిర్వహిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అగ్రిల్యాబ్‌లకు ఇన్‌చార్జ్‌లుగా వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) ఉంటారు. ఇద్దరు ఏఓలు, ఒక ల్యాబ్ టెక్నీషియన్ పరీక్షలు నిర్వహిస్తారు. ల్యాబ్‌లో నమూనా పరీక్ష కోసం ప్రత్యేకంగా ఆటోమేటెడ్ క్వాలిటీ కంట్రోల్ యాప్ అందుబాటులో ఉంచారు. ఫలితాలు తారుమారు కాకుండా వీల్లేని రీతిలో ల్యాబ్‌లో ఆటోమేషన్ ఏర్పాటు చేశారు. టెస్టింగ్ చేసిన ప్రతి ఒక్కటి రికార్డు కావడంతో పాటు వాటంతట అవే సిస్టంలో నమోదు అవుతాయి.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



నాణ్యత ప్రమాణాలతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందించడమే వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ప్రధాన ఉద్దేశం. వీటి ద్వారా నకిలీల బెడద తప్పుతుంది. రైతులు పంటలను కాపాడుకునేందుకు అవకాశం లభిస్తుంది. విత్తనం కొన్న రైతు అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి అగ్రిల్యాబ్‌లో విత్తన పరీక్ష చేయించుకోవాలి. విత్తన పరీక్షలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా కోడింగ్ పద్ధతిన పరీక్ష చేస్తారు. అగ్రి ల్యాబ్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– సునీత, ఏడీఏ, ఆలూరు

అగ్రి ల్యాబ్‌లో చేసే వివిధ పరీక్షలు

- విత్తన మొలక, తేమ శాతం
- విత్తనం స్వచ్ఛత పరీక్ష
- యూరియా, నత్రజని, భాస్వరం
- పొటాష్, జింక్ బోరాన్, సల్ఫేట్
- సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (ఎస్ఎస్‌పీ)
- డై అమ్మోనియం ఫాస్ఫేట్ (డీఏపీ) కాంప్లెక్ ఎరువుల పరీక్షలు చేస్తారు.
- ఆలూరు అగ్రిల్యాబ్‌లో గత మూడేళ్ల నుంచి ఇప్పటివరకు చేసిన విత్తన పరీక్షలు

ఏడాది	విత్తన పరీక్షలు	ఎరువుల పరీక్షలు
2021-22	42	37
2022-23	152	09
2023-24 ఇప్పటివరకు	176	16

ల్యాబ్ పరికరాలు ధ్వంసం

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ల్యాబ్ పరికరాలను ధ్వంసం చేసినట్లు హెచ్ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు కిటికి కడ్డీలను తొలగిం ల్యాబ్ పరికరాలను చిందరవందర పారేయడంతో దాదాపుగా రూ.3 లక్షల విలువ చేసే వస్తువులు దెబ్బతిన్నట్లు తెలిపారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని హెచ్ఎం కోరారు.

ఉపాధి కూలీపై దున్నపోతు దాడి



చికిత్స పొందుతున్న తలారి గౌరమ్మ

చిప్పగిరి: ఉపాధి పనులకు వెళుతున్న ఓ మహిళపై దున్నపోతు దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న తలారి గౌరమ్మ ఉదయం ఉపాధి పనికి వెళుతుండగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఓ దున్నపోతు దాడి చేసింది. గమనించిన తోటి కూలీలు దున్నపోతును తరమడానికి ప్రయత్నించగా రెచ్చిపోయిన దున్నపోతు మరోసారి గౌరమ్మపై కొమ్ములతో దాడి చేసింది. స్థానికులు దున్నపోతును తరిమేశారు. తీవ్రంగా గాయపడిన గౌరమ్మను కుటుంబసభ్యులు గుంతకల్లులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

చురుగ్గా రోడ్డు నిర్మాణ పనులు



దొల్తాపురం వద్ద మట్టి పనులు చేస్తున్న దృశ్యం

చిప్పగిరి: మండలకేంద్రం నుంచి దొల్తాపురం, నంచర్ల మీదుగా మద్దికెర వరకు రూ.10 కోట్లతో 12 కి.మీ మేర చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ సందర్భంగా మట్టి చదును పనులు దొల్తాపురం గ్రామం వరకు పూర్తయ్యాయి. బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే ముఖ్యంగా నంచర్ల, దొల్తాపురం గ్రామ ప్రజలకు మండల కేంద్రానికి చేరుకోవడానికి 40 కి.మీ దూరం తగ్గనుంది. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతుండడంతో నంచర్ల, దొల్తాపురం గ్రామ ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

వేగంగా ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు



మద్దికెర జగనన్న కాలనీలో నిర్మాణం పూర్తయిన ట్యాంకు



మద్దికెరలో నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు

మద్దికెర : మండల కేంద్రమైన మద్దికెరలో నీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.2.70 కోట్ల రూపాయలతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణాలు చేపట్టారు. జల్‌జీవన్ మిషన్ కింద గ్రామంలోని సాయినగర్, రాంనగర్‌లో నీటి సమస్య పరిష్కరించేందుకు ఇంటింటికీ పైపులైన్ పనులు పూర్తి చేశారు. అందులో భాగంగా ఓహెచ్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. స్థానిక సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం వెనుక భాగంలో రూ.65 లక్షలతో చేపట్టిన ట్యాంకు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గుంతకల్లు రహదారిలో ఉన్న జగనన్న కాలనీలో రూ. 17 లక్షలతో ట్యాంకు నిర్మాణం పూర్తి చేశారు. మరో రెండు ట్యాంకు నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కార్యకర్తల రుణం తీర్చుకుంటా..



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరుపాక్షి

ఆలూరు: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటానని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరుపాక్షి అన్నారు. ఆయన బుధవారం ఆలూరు ఎన్జీఓస్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో టీడీపీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడి దుర్భాషలాడినా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఓర్పు, సహనంతో ఉన్నారన్నారు. వారందరికీ తన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మండుటెండలో వేచి ఉండి ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆలూరులో వరుసగా మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారందరూ వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచారని స్పష్టం చేశారు. కురుబ సంఘం మహిళా నాయకురాలు శశికళ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జనార్ధన్‌నాయుడు, నాయకులు మారయ్య, ఈరన్న, రామిరెడ్డి, షఫిఉల్లా, రాఘవేంద్ర, వీరేష్, దొరబాబు, రంగమ్మ, దత్తాత్రేయరెడ్డి, శ్రీనివాసులు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో ప్రయోజనం



కొట్టాల గ్రామంలో పొలాన్ని దుక్కి దున్నుతున్న రైతు

చిప్పగిరి: మండలంలో ఓ మోస్తరు వర్షాలు కురవడంతో పొలాలు అదును అయ్యాయి. దీంతో రైతులు వేసవి దుక్కులు దున్నే పనుల్లో నిమగ్నమయ్యారు. గతేడాది కంటే ముందే వర్షాలు కురవడంతో ఖరీఫ్ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు. వేసవి దుక్కుల వల్ల రైతులకు అనేక లాభాలు ఉన్నాయని వివరించారు. కలుపు మొక్కల నివారణ, భూమిలో నీటి సాంద్రత పెరగడం, పైరుకు చీడ పీడల నియంత్రణ, తదితర ప్రయోజనాలు కలిగి అధిక దిగుబడి సాధించేందుకు అవకాశం ఉంటుందని ఏఓ విజయలక్ష్మి తెలిపారు.



నాగులబావిలో ఈత కొడతూ సేదతీరుతున్న యువకులు

ఈత.. సరదా

మద్దికెర: ఎండలు మండుతున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకే భానుడు తన ప్రతాపాన్ని చాటుతున్నాడు. బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. ఉక్కపోతతో అల్లాడుతున్నారు. దీంతో గ్రామీణ యువత సరదా ఈత కొడుతూ సేద తీరుతున్నారు. దీంతో యువకులు, చిన్నారులతో బావులు నిండిపోతున్నాయి. మరికొందరు పెద్దలు ఈత కొడుతూ ఉపశమనం పొందడమే కాకుండా తమ పిల్లలకు సైతం ఈత నేర్పిస్తున్నారు. ఈ స్థితిలో బుధవారం మద్దికెరలోని నాగులబావి వద్ద పిల్లలు, పెద్దలు జలకాలాడుతూ హుషారుగా కనిపించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు రూరల్: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సూరప్ప బుధవారం తెలిపారు. కళాశాలలో ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానిక్ డీజిల్, వెల్డర్, డ్రెస్ మేకింగ్, కంప్యూటర్ కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు చెప్పారు. ఐటీఐ కళాశాలలో చదివేందుకు అడ్మిషన్లు ఈ నెల 11వ తేదీ ప్రారంభమయ్యాయని, ఆసక్తి గల విద్యార్థులు జూన్ 10 తేదీ సాయంత్రం 5 గంటల్లోపు www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలతో పాటు ఏదేని ప్రభుత్వ ఐటీఐలో జూన్ 10వ తేదీలోపు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. మొదటి విడత దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు గవర్నమెంట్ ఐటీఐ బి.తాండ్రపాడు కర్నూలులో కౌన్సిలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుందని వెల్లడించారు. కౌన్సిలింగ్ అనంతరం అక్కడే కళాశాల సీటు కేటాయిస్తారని చెప్పారు.

21న మండల మీట్

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 21న మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు. ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు అజెండాలోని అంశాల గురించి చర్చిస్తామన్నారు. అలాగే ఆయా శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. అజెండాలో తెలిపిన అన్ని శాఖలకు సంబంధించిన ప్రాథమిక, ఇతర సమాచారాన్ని ఆయా శాఖాధికారులు సమావేశం ఒక రోజు ముందు నాటికి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య



మృతిచెందిన అనసూయమ్మ

హొళగుంద: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని వందవాగిలి గ్రామానికి చెందిన గొల్ల అనుసూయమ్మ (30) బుధవారం కడుపునొప్పి తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. సదరు మహిళకు 13 ఏళ్ల కిందట గ్రామానికి చెందిన సురేష్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. అనసూయమ్మ ఆరు నెలల నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. బుధవారం విపరీతంగా నొప్పి రావడంతో తట్టుకోలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబసభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అనుసూయమ్మ మరణించినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తండ్రి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు వెల్లడించారు.

మట్టి కుప్పలను తొలగించండి సారూ..




హాలహర్విలో రోడ్డు పక్కన ఉన్న మట్టి కుప్పలు

హాలహర్వి: మండలకేంద్రమైన హాలహర్విలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రహదారిలోనూ, ఎస్సీ కాలనీలో వెళ్లే దారిలో రోడ్డు పక్కనే మట్టి కుప్పలు ఉన్నాయని, వాటిని తొలగించాలని కాలనీ వాసులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం వారు మాట్లాడుతూ.. మట్టి కుప్పలు ఉండడం వల్ల కొన్ని రోజుల క్రితం ప్రమాదాలు జరిగాయని, అధికారులు స్పందించి వాటిని తొలగించాలని కోరారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు

పెద్దకడబూరు: మండల కేంద్రంలో వెలసిన గంజెళ్ల వెంకటాగురు శిష్యుడైన ముద్దురంగా గురువుల 139వ గురుపూజ ఆరాధనమహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. గంజహల్లి వెంకటగురువుల మఠం అధ్యక్షుడు కృష్ణమూర్తి స్వామి ఆశీర్వాదాలతో వైశాఖ శుద్ధ అష్టమి బుధవారం రాత్రి గురుపూజ, మంగళహారతులు, తీర్థప్రసాద వితరణ గావించారు. నేడు పుణ్య గణారాధన, పల్లకీ సేవ, నందికోలసేవ ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు.

నేటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో వెలసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలను గురువారం నుంచి నాలుగు రోజులపాటు వైభవంగా జరుగున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామని గ్రామస్తులు తెలిపారు. గురువారం ఉదయం 5 గంటలకు సుప్రభాతం, వేదపారాయణం, పంచబ్రహ్మ ఉపనిషత్తు పారాయణంతో ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతాయి. 9 గంటలకు కుంకుమార్చన, 11 గంటలకు కలశతీర్థం, రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్ల కళ్యాణం, 9 గంటలకు బ్రహ్మంగారి ఉచిత నాటక ప్రదర్శన ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. 17న వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ఆరాధన గురుపూజ మహోత్సవం ఉంటుందన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు నందికోల ప్రభోత్సవం, ముత్యాల తేరుపై ఉత్సవాలు ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

17న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా 17న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. విజేత జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ. 20వేలు, రూ. 15వేలు, రూ.10వేలు చొప్పున అందిచడం జరుగుతుందన్నారు. అదే విధంగా 18న పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని, గెలుపొందిన ఎద్దుల యాజమానులకు రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ5వేలు చొప్పున బహుమతులు అందించనున్నారు. 19న న్యూ కేటగిరి విభాగంలో బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. విజేత వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ. 40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ10వేలు చొప్పున దాతల సహకారంతో అందిస్తామన్నారు.

ప్రజల చెంతకే మెరుగైన వైద్యం

- రూ.1.70 కోట్లతో పీహెచ్‌సీ, రూ.25 లక్షలతో విలేజ్ హెల్త్ సెంటర్ల నిర్మాణం



కురువళ్లిలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్



మొలగవల్లి గ్రామంలో నిర్మించిన పీహెచ్‌సీ

ఆలూరు రూరల్: వైద్యం కోసం నిరుపేదలు అప్పుల పాలు కాకూడదన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ప్రజలకు చేరువగా గ్రామాల్లో హెల్త్ సెంటర్లు నిర్మించింది. గతంలో మండల కేంద్రాలు, పట్టణంలోనే లభించే సంపూర్ణ వైద్య సేవలు ఇప్పుడు ప్రజలకు గ్రామాల్లోనే అందుబాటులోకి వచ్చాయి. డాక్టర్ వైఎస్సార్ విలేజ్‌హెల్త్ క్లినిక్, ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం వాటి ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తోంది. గ్రామ/వార్డు సచివాలయాల వారీగా హెల్త్ క్లినిక్‌లు నిర్మించి నిపుణులైన వైద్యుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ వైద్య సేవలపై ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆలూరు మండలంలోని మొలగవల్లి గ్రామంలో రూ.1.70 కోట్లతో అత్యాధునిక వసతులతో ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మించారు. అలాగే మండలంలో గ్రామాల్లో రూ.25 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ సెంటర్లు ప్రజలకు నిత్యం వైద్య సేవలు అందిస్తున్నాయి.

కురువళ్లిలో వంద శాతం పోలింగ్



పెద్దహోతూరులో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు (ఫైల్)

రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13వ తేదీ సోమవారం జరిగిన పోలింగ్‌లో మండలంలోని కురువళ్లి గ్రామంలోని పోలింగ్ బూత్ నంబర్ 109లో 100 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. గ్రామంలో 460 మంది పురుషులు, 480 స్త్రీ ఓటర్లు మొత్తం 940 మంది ఉన్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 940 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో ఆ గ్రామంలో వంద శాతం పోలింగ్ నమోదైంది. ఇప్పటివరకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ గ్రామంలో తొలిసారి వంద శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం.